
# ఆగని అన్నదాతల నిరసనలు



తీరని రుణం.. రైతన్న రణం


రుణమాఫీపై రైతుల నిరసనలు హోరెత్తుతున్నాయి. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ రోడ్లపైకి వచ్చారు. రుణమాఫీ ఎందుకు కాలేదని అధికారులను నిలదీశారు. బ్యాంకుల ఎదుట నిరసన ప్రదర్శనలు చేశారు. ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మండల కార్యాలయాలకు బాటపట్టి, అధికారులకు ఫిర్యాదులు చేశారు. అర్హత ఉన్నా తమకు ఎందుకు మాఫీ కాలేదంటూ గోడు వెళ్లబోసుకున్నారు. జగిత్యాల జిల్లా రాఘవపేటలో రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. ఆర్మూరు, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల రైతులు సమావేశమై ఐక్య పోరాటాలకు పిలుపునిచ్చారు.

### • జగిత్యాల జిల్లా రాఘవపేటలో రిలే దీక్షలు




జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేటలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న రైతులు. 400 మందికి రుణమాఫీ కాలేదని రైతులు తెలిపారు. నెలరోజుల్లోగా రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటామని ఏడీఏ రైతులకు హామీ ఇచ్చారు.

### • పండుగ పూట.. మండల కేంద్రానికి పోరుబాట




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలో తమకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు. పండుగ ఉన్నా 200మందికి పైగా రైతులు ఏవోకు ఫిర్యాదులు చేశారు.

### • జగిత్యాల డీఏవోకు మల్లాపూర్ రైతుల వినతి



రూ.2 లక్షల లోపు రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారి వాణికి వినతిపత్రం ఇస్తున్న మల్లాపూర్ గ్రామ రైతులు

### • ఆదిలాబాద్ ప్రజావాణికి అన్నదాతల వెల్లువ



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి ఇంద్రవెల్లి మండల రైతులు పెద్దఎత్తున తరలివచ్చి వినతిపత్రాలు అందజేశారు.



## నాకు రూ.1.80 లక్షలున్నా మాఫీగాలే!

నాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. నాలుగేండ్ల క్రితం తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1.80 లక్షలు లోన్ తీసుకున్నా. నాకు మూడు విడుతల్లోనూ రుణమాఫీ కాలేదు. రుణమాఫీపై సర్కారు మోసపూరిత ప్రకటనలు చేస్తూ రైతులకు ఆన్యాయం చేస్తున్నది. భవిష్యత్తులో ఈ కాంగ్రెస్ సర్కారుకు రైతులు తగిన గుణంపాఠం చెప్పాలి. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి.

*-కొలుగూరి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, కట్కూరు (సిద్దిపేట జిల్లా)*

### • సీఎం దిష్టిబొమ్మ దహనం



సిద్దిపేట జిల్లా అక్కెనపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. అనంతరం సీఎం డౌన్‌డౌన్ అంటూ నినదిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు.



## కేసీఆరే నయం.. కాంగ్రెస్ సాయమే అందకపాయే!

నాకు ఆరెకరాలు భూమి ఉన్నది. రూ.2.50 లక్షల లోన్ ఉన్నది. మూడు విడుతల్లోనూ నాకు రుణమాఫీ కాలే. నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉండి పని చేసిన. కేసీఆర్ ప్రభుత్వమే నయం. అప్పుడు ఒక్కసారే రూ.80 వేలు మాఫీ వస్తే మళ్లా రుణం తీసుకున్న. అప్పుడు ఇట్లా బ్యాంకులు, వ్యవసాయ అధికారుల సుట్టూ తిరుగుడు లేకుండె.

*-సాకి యాకయ్య, కొరిపల్లి గ్రామం, పెద్దవంగర(మహబూబాబాద్)*

### • సొసైటీ ఆఫీసుకు తాళం వేసి పాల్దాలో నిరసన



నిజామాబాద్ జిల్లా పాల్దా సొసైటీ కార్యాలయం గేటుకు తాళం వేసి రైతులు నిరసన తెలిపారు. పంట రుణాలు మాఫీ చేయాలని కోరుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు పెద్దపెట్టున నినాదాలు చేశారు.

### • అయిజ రైతువేదిక వద్ద నిరసన



జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని రైతువేదిక వద్ద బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు




## ఒకరికొచ్చింది.. ఇంకొకరికి రాలే!

నాకు అశ్విని, అఖిల ఇద్దరు కూతుళ్లు. చెరి రెండెకరాల చొప్పున వ్యవసాయ భూమి, పట్టా పాస్‌బుక్‌లు ఉన్నాయి. అశ్విని పేరును రూ.60 వేలు, అఖిల పేరును రూ.లక్ష పంట రుణం తీసుకున్నా. అశ్విని రూ.60 వేలనే మాఫీ చేశారు. అఖిల పేరుపై ఉన్న రూ.1.20 లక్షలు మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే రాదని అంటున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు.

*- మోదిపట్ల రాములు, తానేదార్‌పల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ జిల్లా*

### • రైతులకు బోథ్ ఎమ్మెల్యే పరామర్శ




పోలీసులు అరెస్టు చేసిన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామ రైతులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

### • రుణమాఫీకి అర్గుల్‌లో పోరుబాట



నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో రైతులు సమావేశమయ్యారు. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల రైతులు పాల్గొని, రుణమాఫీ కోసం ఐక్యపోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు.

## సగం మంది రైతులకు మాఫీ కాలేదు



సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మూడు విడుతలు పెట్టిండ్రు. ఊళ్లల్లో మాత్రం సగం మందికి కూడా రుణమాఫీ జరగలేదు. 3 లక్షలలోన్ తీసుకున్నా. రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదు.

*-జిల్లెల గాల్‌రెడ్డి, రైతు, కట్కూరు (సిద్దిపేట జిల్లా)*

## నేను కాంగ్రెస్ కార్యకర్తనే.. అయినా రుణమాఫీ కాలే



నాకు ఐదున్నరెకరాల భూమి ఉన్నది. 2.20 లక్షల లోన్ ఉన్నది. నెల కింద 14 వేలు మిత్తి కట్టి రెన్యువల్ కూడా చేసిన. మూడో విడతలో రుణమాఫీ లిస్టులో నా పేరు రాలే. నేను కాంగ్రెస్ కార్యకర్తనే. కాంగ్రెస్ ప్రభుత్వంల రుణమాఫీ పరిస్థితి గిట్లుండే. మా ఊర్లో చాలామందికి రుణమాఫీ కాలే.

*- కలుకోటి వెంకట్‌రెడ్డి, కొరిపల్లి, పెద్దవంగర (మహబూబాబాద్)*

### • సిండికేట్ బ్యాంకు ఎదుట రైతుల నిరసన



నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్‌లోని సిండికేట్ బ్యాంకు ఎదుట రైతులు రుణమాఫీ చేయనందుకు నిరసనగా ఆందోళన చేపట్టారు. పోలీసులు వారించినా వినకుండా రుణమాఫీ చేయాల్సిందేనంటూ పట్టుబట్టారు.

### • ధన్నూర్ (బి)లో రైతుల నిరసన



తమకు రుణమాఫీ కాలేదని ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ధన్నూరు (బి) గ్రామంలో రైతులు నిరసన ప్రదర్శన చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసించారు.



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేటలో రైతుల రిలే నిరాహారదీక్ష శిబిరం వద్దకు వచ్చి మాట్లాడుతున్న ఏడీఏ లావణ్య. ఆ తర్వాత రైతులకు రాఖీలు కట్టి రైతుల దీక్షలను విరమింపజేశారు. నెలరోజుల్లోగా రుణమాఫీ చేస్తామంటూ వారికి హామీ ఇచ్చారు.

### • హైవేపై వెల్మల్ రైతుల రాస్తారోకో



నిజామాబాద్ జిల్లా పరిధిలోని నందిపేట-నిజామాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న నందిపేట మండలం వెల్మల్ గ్రామ పరిధిలోని రైతులు. ఈ సందర్భంగా తమకు రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నినదించారు. రుణమాఫీ చేయని ప్రభుత్వ వైఖరిని నిరసించారు.